BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 17 ఆగస్టు 2024 www.balagamtv.com పేజీలు 3

## వైద్య సిబ్బందిపై దాడి జరిగిన 6 గంటల్లో ఎఫ్ఐఆర్

### వైద్య సంస్థలకు కేంద్రం ఆదేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కోల్‌కతా ట్రైనీ డాక్టర్ ఘటనతో వైద్యసంస్థలకు కేంద్ర ఆరోగ్యశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. విధుల్లో ఉన్న వైద్యసిబ్బందిపై దాడి జరిగిన ఆరు గంటల్లోగా ఇన్‌స్టిట్యూషనల్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పష్టం చేస్తూ దేశంలోని అన్ని కేంద్ర ప్రభుత్వ దవాఖానలు, ఎయిమ్స్ డైరెక్టర్లకు, అన్ని మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ గోయెల్ ఆదేశాలిచ్చారు. 'విధుల్లో ఉండగా ఏ ఆరోగ్య కార్యకర్తపైనైనా దాడి జరిగితే.. 6 గంటల్లోగా ఇన్‌స్టిట్యూషనల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసే బాధ్యత వైద్య సంస్థ అధిపతిదే' అని పేర్కొన్నారు.



# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఖాయం

- కేసీఆర్ గవర్నర్ .. కేటీఆర్‌కు కేంద్రమంత్రి పదవి
- హరీశ్‌రావుకు అపోజిషన్ లీడర్.. కవితకు బెయిల్
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అవుతుందని తెలిపారు. దీంతో పాటూ ఆ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు ఎలాంటి పదవులు వరిస్తాయోకూడా చెప్పేశారు.తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గవర్నర్ అవుతారని, అలాగే కేటీఆర్‌కు కేంద్రమంత్రి పదవి వరిస్తుందని చెప్పారు. ఇక మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ అసెంబ్లీలో అపోజిషన్ లీడర్‌గా ఉంటారన్నారు.

ప్రస్తుతం బీఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. బీఆర్ఎస్, బీజేపీలో విలీనం అయ్యాక ఆ నలుగురి మద్దతు కూడా బీజేపీకి వస్తుందన్నారు. ఆ తరువాత కవితకు బెయిల్ వస్తుందని కీలక వ్యాఖ్యలు చేశారు. కవితకు బెయిల్ అనంతరం.. బీఆర్ఎస్ నాలుగు రాజ్యసభ సీట్లకుగానూ కవితకు కూడా రాజ్యసభ సభ్యురాలిగా పదవి కేటాయించే అవకాశం ఉందని తెలిపారు. అందుకే బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అవ్వడం తథ్యం అని జోస్యం చెప్పారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఖండించినా ఎప్పటికైనా అది జరగకమానదని చెప్పారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన విధి విధానాలను గురించా వివరించారు. ఫాక్స్ కాన్ సంస్థ ప్రతినిధులు హైదరా బాద్ రానున్నారని తెలిపారు. తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ కొనసాగుతుందని చెప్పారు. అలాగే రైతు రుణమాఫీకి 5 వేల కోట్ల నిధులు రిజర్వ్‌లో ఉంచామన్నారు. ఇప్పటికీ రుణమాఫీ కాని వారు ఎవరైనా ఉంటే జిల్లా కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఒకే కుటుంబంలో వారికి రూ. 2 లక్షలకు పైగా రుణం ఉంటే వారిని ఒక యూనిట్‌గా పరిగణించి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. తన మార్క్ ఉండాలనే ఆగస్టు 15 వరకు రుణమాఫీని ప్రకటించానన్నారు. బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదని, కేంద్ర బడ్జెట్?లో తెలంగాణకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదన్నారు.

# కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం..

- టీపీసీసీ చీఫ్‌గా కేటీఆర్, కేసీఆర్‌కు ఏఐసీసీ, కవితకు రాజ్యసభ ఎంపీ
- కేంద్ర మంత్రి బండి సంజయ్

**బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శలు చేస్తుండగా.. కాంగ్రెస్‌లోనే బీఆర్ఎస్ విలీనం అవుతుందంటూ బీజేపీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు నుంచే బీఆర్ఎస్.. బీజేపీలో విలీనం అవుతుందని మొదట కాంగ్రెస్ నేతలు ఆరోపించగా.. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అంటూ రెండు పార్టీల నేతలు ప్రచారం చేస్తున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలో బీఆర్ఎస్ కలుస్తుందని అనగా.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ కలవబోతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. మొత్తానికి కాంగ్రెస్, బీజేపీల మధ్య విమర్శల్లో.. ఆ రెండు పార్టీలకు బీఆర్ఎస్ ప్రధాన అస్త్రంగా కనిపిస్తోంది.**



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బీజేపీలో బీఆర్ఎస్‌ను కలిపేస్తారు అంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తుంటే.. ఆ విమర్శలకు బీజేపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. తాజాగా కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనమవుతుందని.. ఏఐసీసీకి కేసీఆర్‌ను పంపిస్తారని.. కేటీఆర్‌ను తెలంగాణ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిని చేస్తారని.. అదే సమయంలో కవితకు రాజ్యసభ పదవిని ఆఫర్ చేస్తారని.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని బీజేపీ సీనియర్ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో కేసీఆర్‌కు ఏఐసీసీకి పంపిస్తారని.. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా కేటీఆర్‌ను నియమిస్తారని.. ఇక కల్వకుంట్ల కవితకు రాజ్యసభ సీటు ఖాయం చేస్తారని బండి సంజయ్ తెలిపారు. తాజాగా మీడియాతో మాట్లాడిన బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. పొత్తు పెట్టుకుని పదవులు పంచుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్‌లది అని పేర్కొన్నారు. ఇక ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్ట్ అయి ఢిల్లీలోని తీహార్ జైలులో కస్టడీలో ఉన్న కల్వకుంట్ల కవిత బెయిల్‌కు.. బీజేపీకి ఏం సంబంధం ఉందని బండి సంజయ్ ప్రశ్నించారు.

మిగితా 2వ పేజీలో

# నేడు దేశవ్యాప్తంగా వైద్య సేవలు బంద్

- కోల్‌కతా లైంగికదాడి హత్య ఘటనను నిరసిస్తూ 24 గంటల ఆందోళనకు ఐఎంఏ పిలుపు
- అత్యవసరం కాని సేవలు నిలిపివేత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి హత్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సిద్ధమైంది. బుధవారం రాత్రి కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ ఆస్పత్రిలో జరిగిన విధ్వంసానికి వ్యతిరేకంగా, శనివారం(ఆగస్టు 17) ఉదయం 6 గంటల నుంచి దేశవ్యాప్తంగా ఓపీ సేవలను ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపింది. కాగా, అత్యవసర సేవలు, క్యాజువాలిటీ సేవలు యథావిధిగా పనిచేస్తాయని వెల్లడించింది. రాష్ట్ర శాఖలతో సమావేశం అనంతరం ఐఎమ్ఏ ఈ నిర్ణయం తీసుకుంది.

"కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై జరిగిన క్రూరమైన ఘటనకు వ్యతిరేకంగా, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి విద్యార్థులు నిరసన చేపట్టారు. వారు నిరసన తెలిపిన ప్రాంగణంపై అల్లరి మూకలు దాడి చేశాయి. ఈ హేయమైన చర్యకు వ్యతిరేకంగా శనివారం(ఆగస్టు 17) ఉదయం 6 గంటల నుంచి ఆదివారం(ఆగస్టు 18) ఉదయం 6 గంటల వరకు మోడర్న్ మెడిసిన్? డాక్టర్ల సేవలు ఉపసంహరించుకుంటున్నాం. వైద్య వృత్తి స్వభావం కారణంగా వైద్యులు ముఖ్యంగా మహిళలు హింసకు గురవుతున్నారు. అలాంటి డాక్టర్లకు ఆస్పత్రులు, క్యాంపస్‌ల్లో భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. వైద్యులు, నర్సులు, ఇతర




ఆరోగ్య కార్యకర్తల అవసరాలను పర్యవేక్షించే అధికారుల ఉదాసీనత వల్లే వైద్యులపై భౌతిక దాడులు, నేరాలు జరుగుతున్నాయి." అని ఐఎమ్ఏ ఓ ప్రకటనలో వివరించింది.ఈ సందర్భంగా ఐఎంఏ కేంద్ర ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్లు ఉంచింది. ఎయిర్‌పోర్టుల మాదిరిగా దేశవ్యాప్తంగా ఉన్న దవాఖానలను కూడా 'సేఫ్ జోన్లు'గా ప్రకటించాలని ఐఎంఏ చీఫ్ డాక్టర్ ఆర్‌వీ ఆశోకన్ డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బందిపై దాడుల కట్టడికి కఠిన చట్టం తీసుకురావాలన్నారు. బాధితురాలి కుటుంబానికి గౌరవప్రదమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్యుల పని గంటలు, పని పరిస్థితులపై ఐఎంఏ మరో డిమా ండ్ చేసింది. లైంగికదాడి, హత్యకు గురైన బాధితురాలు వరుసగా 36 గంటల పాటు డ్యూటీలో ఉన్నారని, ఇది సరైనదేనా? అని ప్రశ్నించారు.

ఇదిలా ఉండగా కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానపై దుండగులు సృష్టించిన విధ్వంసం కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యమేనని కలకత్తా హైకోర్టు శుక్రవారం పేర్కొన్నది. దవాఖానలో పరిస్థితిపై ఈనెల 21లోగా వేర్వేరుగా అఫిడవిట్లు సమర్పించాలని పోలీసులు, హాస్పిటల్ యాజమాన్యాన్ని చీఫ్ జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం

మిగితా 2వ పేజీలో

## ఎమ్మెల్సీలుగా కోదండరామ్, ఆమీర్ ప్రమాణస్వీకారం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధిస్తూ తీర్పును వెలువరించింది. దీంతో ఎమ్మెల్సీల నియామకంపై ఎట్టకేలకు సందిగ్ధం వీడింది. ఈ మేరకు శుక్రవారం టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్ట్ అమెర్ అలీఖాన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. శాసన మండలిలో చైర్మన్ చాంబర్‌లో గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు.

## దమ్ముంటే కొడంగల్‌కు రా..

# రుణమాఫీపై చర్చ పెడదాం




- వంద శాతం రుణమాఫీ జరిగిందని ఒక్క రైతు చెప్పినా రాజకీయాలను వదిలేస్తా
- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రైతు రుణమాఫీ 40 శాతం మాత్రమే చేశారని బీఆర్ఎస్ క్యార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. రుణమాఫీలో సవాలక్ష కొర్రీలు, ఆంక్షలు పెట్టారని, రైతు రుణమాఫీ పేరు తో ప్రజలను మోసం చేశారని ఆయన దుయ్యబట్టారు. రైతు రుణమాఫీ పైన తాను సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నట్లు తెలిపారు. ఒకవేళ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన రుణమాఫీ నిజమైతే, కొడంగల్ నియోజకవర్గానికే మీడియాతో కలిసి వెళ్దామన్నారు. ఒక్క రైతు వేదికలోనైనా వంద శాతం రుణమాఫీ జరిగిందని ఒక్క రైతు చెప్పినా తాను రాజకీయాలను వదిలేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. సీఎంకు దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలని ఛాలెంజ్ చేస్తున్నట్లు తెలిపారు.

వంద శాతం రుణమాఫీ ఎక్కడ జరిగిందని కాంగ్రెస్ నాయకులను ఆయన ప్రశ్నించారు. రుణమాఫీపై మీరు చెప్పిన మాటల్లో నిజం ఒక్క శాతం నిజం ఉన్నా సరే.. సెక్యూరిటీ లేకుండా నీ కొడంగల్ నియోజకవర్గానికి రావాలని సవాలు విసిరారు కొడంగల్ నియోజకవర్గంలోని ఏ గ్రామంలో అయినా సరే వంద శాతం రుణమాఫీ జరిగిందని చెబితే అక్కడికక్కడే రాజీనామా చేస్తానని అన్నారు.

కొడంగల్‌లో మాత్రమే కాదని.. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో చాలా ఊర్లు తిరిగి.. ఈ పచ్చి మోసాన్ని ఎండగడతామని స్పష్టం చేశారు. దమ్ముంటే ముఖ్యమంత్రి తన సవాలును స్వీకరించాలని అన్నారు. కొడంగల్‌లో కాకుంటే ఉమ్మడి పాలమూరులోని ఏ నియోజకవర్గంలో అయినా చర్చకు రెడీనా అని ప్రశ్నించారు. నీ సొంతూరు కొండారెడ్డిపాలెంలో అయినా సరే వంద శాతం రుణమాఫీ జరిగిందని రుజువు చేయాలని సవాలు విసిరారు.

సగం కూడా రుణమాఫీ చేయకుండా వంద శాతం చేశామని చెప్పుకోవడం సంపూర్ణంగా దిగజారడమే అని కేటీఆర్ మండిపడ్డారు. రుణమాఫీ కాలేదని చాలామంది రైతులు ఆందోళనలో ఉంటే.. సంబరాలు చేసుకుంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. రైతు రుణమాఫీ పచ్చి మోసం, దగా అని పునరుద్ఘాటించారు. రైతులను మోసం చేసినందుకు ముఖ్యమంత్రి మీద చీటింగ్ కేసు పెట్టాలని రైతులకు పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో రంకెలు వేస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొండల్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన విజయవంతమైనట్లు ఉంది.. అదే రేవంత్ అమెరికా టూర్ ఆ స్థాయిలో వర్కవుట్ అయినట్టు లేదు.. దీంతో ఫ్రస్టేషన్ పెరిగిపోయిందని అన్నారు. పైగా రేవంత్ రెడ్డి లేని టైమ్‌లో తిరుపతి రెడ్డి ప్రచారం కూడా బాగానే జరిగిందని చెప్పారు. కుటుంబంలో మిగతా సభ్యులు దూసుకెళు తున్నారనే బాధనా? తాను లేనప్పుడు భట్టి చాలా తిరిగారని భయమో? అధిష్ఠానం ఏదైనా అదిలిస్తుందేమోనని భయమో తెలియదు గానీ.. మొత్తానికి ఆ ఫ్రస్టేషన్‌లో రంకెలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు.

పంద్రాగస్టుకు స్పీచ్ ఇచ్చిన రేవంత్ రెడ్డి భాక్రానంగల్ ప్రాజెక్టు

మిగితా 2వ పేజీలో

# ఫోర్త్ సిటీలోనూ ఫాక్స్‌కాన్ పెట్టుబడులు



- ముఖ్యమంత్రి విజన్ అద్భుతమన్న యాంగ్ లియూ
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఫాక్స్‌కాన్ చైర్మన్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీలోని అధికారిక నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక సంస్థ ఫాక్స్‌కాన్‌చైర్మన్ యాంగ్ లియూ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో కొత్త పెట్టుబడుల విస్తరణ అంశంపై ఫాక్స్‌కాన్ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. ఈ సమావేశంలో సీఎం వెంట పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ఉన్నతాధికారులు ఉన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా పెట్టుబడులకు అనుకూలమైన కొత్త విధానాలను ప్రజాప్రభుత్వం అమలు చేస్తోందని, అంతర్జాతీయ అవసరాలకు తగ్గట్టు హైదరాబాద్ శివారులో ఫోర్త్ సిటీ (ఫ్యూచర్ సిటీ)ని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూకి వివరించారు. ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్ సంస్థ కూడా పెట్టుబడులు పెట్టాల్సిందిగా సీఎం ఆహ్వానించారు. ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్ వారు పరిశ్రమలు నెలకొల్పేందుకు అవసరమైన సహకారాన్నిఅందిస్తామని యాంగ్ లియూ గారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

ఫ్యూచర్ సిటీగా ఫోర్త్ సిటీ రూపకల్పనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దార్శనికత, పారిశ్రామిక అనుకూల విధానాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ అన్నారు. ఫోర్త్ సిటీతో పాటు పారిశ్రామిక అనుకూల విధానాల్లో సీఎం రేవంత్ రెడ్డి గారి విజన్ అద్భుతంగా ఉందని యాంగ్ లియూ కొనియాడారు.

సాధ్యమైనంత తొందర్లోనే హైదరాబాద్ ను సందర్శిస్తానని ఫాక్స్‌కాన్ చైర్మన్ ముఖ్యమంత్రితో చెప్పారు. అంతకంటే ముందుగా ఫాక్స్‌కాన్ క్యాంపస్ ఆపరేషన్స్ చీఫ్ క్యాథీ యాంగ్ , ఫాక్స్‌కాన్ భారత దేశ ప్రతినిధి వీ లీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్ వస్తుందని యాంగ్ లియూ తెలిపారు.

సమావేశంలో మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇటీవల ముఖ్యమంత్రి బృందం విజయవంతంగా చేపట్టిన అమెరికా, దక్షిణ కొరియా పర్యటన, రాబట్టిన పెట్టుబడులు, తెలంగాణపై అంతర్జాతీయంగా నెలకొన్న ఆసక్తుల వివరాలను కూడా మంత్రి శ్రీధర్ బాబు గారు యాంగ్ లియూ గారికి వివరించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో భేటీలో ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ వెంట ఆ సంస్థ ఎస్బీజీ ప్రెసిడెంట్ బాబ్ చెన్, సీబీజీ జీఎం జొ వూ , చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్ , సీఎస్‌బీజీ డిప్యూటీ జీఎం సూ, షో కూ, సీ-గ్రూప్ మేనేజర్ సైమన్ సంగ, సంస్థ భారత దేశ ప్రతినిధి వీ లీ తదితరులు ఉన్నారు. సమావేశంలో ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారు, పెట్టుబడుల విభాగం ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ డైరెక్టర్ ఎస్కే శర్మ తదితరులు పాల్గొన్నారు.

## దమ్ముంటే కొడంగల్‌కు రా..
# రుణమాఫీపై చర్చ పెడదాం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో ఉందని చెప్పారని అన్నారు. ఈ విషయం తమకు తెలియక.. పిచ్చోళ్లలెక్క ఇన్ని రోజులు ఉత్తర భారతదేశానికి వెళ్లామని ఎద్దేవా చేశారు. ఇంత గొప్ప ముఖ్యమంత్రిని ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు చూస్తుంటే ఆయన మానసిక సంతులనం మీద అనుమానం కలుగుతుందని కేటీఆర్ అన్నారు. పాపం ఆయనకు ఏదో అయినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిని వెంటనే వైద్యులకు చూపించాలని ఆయన కుటుంబసభ్యులకు సూచించారు. పిచ్చోడి చేతిలో రాయిలా మారితే రాష్ట్రానికి ప్రమాదమని అన్నారు. రేవంత్‌కు సంబంధించిన అన్ని విషయాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో ఆయనలో అసహనం, ఫ్రస్ట్రేషన్ పెరిగిపోయిందని విమర్శించారు. దీంతో తిట్లు, బూతులు మాట్లాడుతున్నారని అన్నారు. లాగులో తొండలను తోలుతా, చెట్టుకు కట్టేస్తా, చంపేస్తా, నరికేస్తా, ఏట్ల దుంకు, గుడ్లతో గోలీలు ఆడుతా అనే మాటలు మానేయాలని రేవంత్‌కు సూచించారు. నువ్వు కాదు.. సెక్యూరిటీ లేకుండా వెళ్తే రైతులే నిన్ను ఫుట్‌బాల్ ఆడతారని ఎద్దేవా చేశారు.



రేవంత్ రెడ్డి దివాళాకోరు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పంద్రాగస్టు లోపు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అన్నారని గుర్తుచేశారు. రుణమాఫీ జరిగింది హరీశ్‌రావు అర్జెంట్‌గా రాజీనామా చెయ్యి అని చిల్లరగాళ్లు పోస్టర్లు పెట్టారని అన్నారు. రుణమాఫీ ఎక్కడ జరిగిందో చెప్పించాలని సవాలు విసిరారు. ఒక విజన్ లేదు, విధానం లేదు, డొల్ల మాటలు, కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని అన్నారు.

ఇక సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్ వేశారు. బీజేపీలో బీఆర్ఎస్ త్వరలోనే విలీనం అవుతుందని, ఆ వెంటనే కేసీఆర్ గవర్నర్, కేటీఆర్ కేంద్రమంత్రి కాబోతున్నారని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడని వ్యంగ్యంగా మాట్లాడారు. రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడని అలా నేను కూడా స్టోరీలు చెప్పగలనని అన్నారు. రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడు. మనోడు అమెరికా అధ్యక్షుడు అయితడని.. మొన్ననే కేజీఎఫ్‌లో ఏదో మీటింగ్ పెట్టి ఆయనెవరో చెప్పారు కదా.. ఈయనే అయితడేమో మరి' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ట్రంప్ సరిపోతలేడని.. రేవంత్‌ను పిలుస్తున్నారేమో అని వెటకారంగా అన్నారు.

మాకు రాజీనామాలు కొత్త కాదు.. రేవంత్ రెడ్డికి మోసాలు కొత్త కాదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి మాట తప్పిన సన్నాసి ఎవరని ప్రశ్నించారు.

మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంపై కూడా కేటీఆర్ స్పందించారు. మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. యథాలాపంగా మాట్లాడుతూ ఒక్క మాట అన్నానని.. అందుకే క్షమించాలని సోదరీమణులను అడిగానని చెప్పారు. తాను ముందుకొచ్చి ఆ మాట మాట్లాడానని తెలిపారు. సబితక్క, సునీతక్క, కోవా లక్ష్మక్క గురించి పనికిమాలిన మాటలు మాట్లాడినందుకు క్షమాపణలు చెప్పే ఇంగితం గానీ, సంస్కారం గానీ ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. సంస్కారం ఉంటే క్షమాపణ చెప్పాలని కోరారు.

# కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం..

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తే కవితకు బెయిల్ వస్తుందనడం మూర్ఖత్వమని బండి సంజయ్ మండిపడ్డారు. కవిత బెయిల్ విషయంలో బీజేపీపై కాంగ్రెస్ పార్టీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్‌లను.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎందుకు అరెస్ట్ చేయట్లేదని ఈ సందర్భంగా బండి సంజయ్ ప్రశ్నించారు.

మరోవైపు.. బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేస్తారు అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ప్రచారంలో నిజం లేదని.. అవన్నీ ఊహాజనితమని కొట్టిపారేశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విష ప్రచారంలో భాగమని మండిపడ్డారు. బీజేపీలో అలాంటి చర్చనే ప్రస్తావనకు రాలేదని.. అది జరగదని ఈటల రాజేందర్ తేల్చి చెప్పారు. ఇక తెలంగాణలో రైతులకు రుణమాఫీ పూర్తిగా జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటన మొత్తం బోగస్ అని తెలిపారు. రాష్ట్రంలో రుణమాఫీ రూ. 72 వేల కోట్లు ఉండగా.. విధివిధానాల పేరుతో దాన్ని రూ.34 వేల కోట్లకు కుదించారని ఆరోపించారు. హైడ్రా పేరుతో జరుగుతోన్న హైడ్రామాను ఆపాలని.. అక్రమ కట్టడాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం.. చిత్తశుద్ధి ఉంటే నిర్మాణాలు జరగకుండా చూడాలని హితవు పలికారు.

# జమ్ము కశ్మీర్‌లో మోగిన ఎన్నికల నగరా

- మూడు దశలలో పోలింగ్
- సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1వ తేదీలలో ఎన్నికలు
- హర్యానా అసెంబ్లీకి సైతం అక్టోబర్ ఒకటో తేదిన పోలింగ్



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల తర్వాత మరోసారి దేశంలో ఎన్నికల నగారా మోగింది. రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మీడియాకు నేడు వివరాలుతెలిపారు. .

ఇక హర్యానా విధానసభ పదవీకాలం నవంబర్ 26తో ముగియనుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలచేశారు. . అక్టోబర్ 1వ తేదీన హర్యానా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన ఫలితాలు వెలువరిస్తామని చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూ కశ్మీర్, లఢఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30లోగా అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీం ఆదేశాల మేరకు జమ్మూకశ్మీర్‌లో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం యోచిస్తోంది. ఇందులో భాగంగానే ఇటీవలే కమిషన్ బృందం లోయను సందర్శించింది. అక్కడ అన్ని రాజకీయ పార్టీలతో భేటీ అయ్యి ఎన్నికల నిర్వహణపై అభిప్రాయాలను తీసుకుంది.

మరోవైపు ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్‌లో 58.58 శాతం పోలింగ్ నమోదు కావడంపై ఈసీ సంతృప్తి వ్యక్తం చేస్తోంది. మూడు నాలుగు దశాబ్దాల్లో ఈసారే కశ్మీర్‌లో ఎన్నికలు అత్యంత ప్రశాంతంగా జరిగాయి. ప్రజలు ఓటింగ్‌కు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఎన్నికలు ఇప్పుడే నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. కాగా, గతంలో జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో 107 స్థానాలుండగా ఇప్పుడు 114కు పెరిగాయి. వీటిలో 24 సీట్లు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉండగా మిగతా 90 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిల్లో జమ్ము ప్రాంతంలో 43 స్థానాలు, కశ్మీర్ వ్యాలీలో 47 స్థానాలు ఉన్నాయి. ఇక జమ్ము కాశ్మీర్‌లో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తామని ఈసీ చీఫ్ కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1వ తేదీన జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు.

# నేడు వైద్య సేవలు బంద్

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది. దవాఖాన వద్ద దాదాపు 7 వేల మంది గుమిగూడుతారన్న నిఘా వర్గాల సమాచారం పోలీసుల వద్ద లేదనడం నమ్మడం కష్టమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. 'ఇది పూర్తిగా రాష్ట్ర యంత్రాంగం వైఫల్యమే. తమ సొంత వ్యక్తులను కూడా పోలీసు బలగాలు రక్షించుకోలేకపోవడం విచారకరం' అని పేర్కొన్నది. హాస్పిటల్‌లో పనిచేస్తున్న వైద్యులకు తగిన రక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నది. మూకను అదుపు చేయలేక పోలీసులు గాయపడ్డారంటే, శాంతి భద్రతలు విఫలమైనట్టేనని కోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను కోర్టు ఈనెల 21కు వాయిదా వేసింది.

# రాష్ట్రంలో ఐదు రోజులు వానలు...



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాగల 24గంటల్లో ఉరుములు మెరుపులతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నట్లు తెలిపింది.గంటకు 40కిలోమీటర్ల వేగంతోకూడిన బలమైన గాలులు వీయనున్నట్లు తెలిపింది. ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు వారద్దని అధికారులు హెచ్చరించారు. అదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపరి ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో గాలులు వీయనున్నట్లు తెలిపింది. ప్రజలు అవసరమైతే తప్ప బయటికి రావద్దని అధికారులు సూచించారు.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కమ్ముకున్న మబ్బులతో గ్రేటర్ హదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు వరద నీటితో మునిగిపోయాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్థంబించి పోయింది. ప్రజలు రోడ్లపై వాహనాలు నడిపేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గత కొన్ని రోజులుగా నెలకొన్న ఎండ వేడిమికి ఉపశమనం లభించింది. ఎండల ధాటికి వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షాలు కాస్త ఉపశమనం కలిగించాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గంగాధర, రామడుగు, చొప్పదండి, ధర్మపురి, చిగురు మామిడి, బోయినపల్లి తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో అక్కడ విద్యుత్ సరఫరాకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. రెండు గంటల పాటు ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో అన్నదాతల్లో ఆనందం నెలకొంది. కొన్ని చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మరోవైపు సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గత కొంతకాలం నుంచి వర్షాలు లేక ఎండు ముఖం పట్టిన పత్తి, మొక్కజొన్న పంటలకు జీవం పోసినట్లయింది. వర్షం పడడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రేటర్ హైదరబాద్‌లో జనజీవనం అస్తవ్యస్థం**

జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుసింది. కుండపోతగా కురిసిన వర్షం, సిటీ రోడ్లను మరోసారి చెరువులుగా మార్చిదంది. మధ్యాహ్నం నుంచి మొదలైన వర్షం, క్రమంగా నగరమంతటా విస్తరించింది. సికింద్రాబాద్, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట్, చిలకలగూడ, మారేడుపల్లి, మేడ్చల్, కండ్లకోయ, దుండిగల్ ప్రాంతాల్లో జడివాన పడింది. ఒక్కసారిగా కుంభవృష్టిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.ఏకధాటిగా వర్షం కురువడం వల్ల ప్రధాన రహదారులపై నీరు చేరి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపోవడంతో రహదారులపై వరద నీరు ప్రవహించింది. చాలాచోట్ల వాహనాలు రోడ్లపై నిలిచిపోయి ట్రాఫిక్ నిలిచిపోయింది. కూకట్‌పల్లి, హైదర్‌నగర్, నిజాంపేట్, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లోనూ వరుణుడు విరుచుకుపడ్డాడు.

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్, సనత్‌నగర్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్ నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌లోనూ భారీ వర్షం పడింది. ఈ ప్రభావంతో రహదారులపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసులు విడిచిపెట్టే సమయం కావడంతో పలుచోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. రద్దీ ప్రాంతాలైన అమీర్‌పేట, పంజాగుట్ట, కూకట్‌పల్లి, బయో డైవర్సిటీ, కోఠి ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంది. హైదరాబాద్‌లో భారీ వర్షంపై వాతావరణ శాఖ శుక్రవారం సాయంత్రమే రెడ్ అలర్ట్ జారీ చేసింది. వర్షంతో రహదారులపై నీరు చేరకుండా జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. ఏమైనా ఇబ్బందులుంటే 040 – 21111111కు ఫోన్ చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.

# అక్కాచెల్లెమ్మలను కించపరిచే ఉద్దేశం లేదు

- కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పార్టీ సమావేశంలో తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల సోదరీమణులకు మనస్తాపం కలిగితే విచారం వ్యక్తం చేస్తున్నానని కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'నా అక్కాచెల్లెమ్మలను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదు' అని పేర్కొన్నారు. కాగా, మహిళల ఉచిత బస్సు ప్రయాణాలపై కేటీఆర్ యథాలాపంగా చేసిన వ్యాఖ్యలకు రాజకీయ రంగు పులుముకున్న విషయం తెలిసిందే. మరోవైపు కేటీఆర్‌కు తెలంగాణ మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 24న కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది.

# గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల సమయాల్లో మార్పు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో టీజీపీఎస్సీ నిర్వహించనున్న గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల వేళల్లో మార్పులు చేశారు. ఈ మేరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయం తీసుకుంది. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపింది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ జరగనున్న సంగతి తెలిసిందే.. కాగా, అసలు షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగాల్సి ఉండగా.. అరగంట ముందే ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు.

**తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ 2024 ఎగ్జామ్ షెడ్యూలు..**

–అక్టోబర్ 21, 2024: జనరల్ ఇంగ్లిష్ (అర్హత సాధిస్తే చాలు)
–అక్టోబర్ 22, 2024: పేపర్–1 (జనరల్ ఎస్సే)
–అక్టోబర్ 23, 2024: పేపర్–2 (హిస్టరీ, కల్చర్ అండ్ జాగ్రఫీ)
–అక్టోబర్ 24, 2024: పేపర్–3 (ఇండియన్ సొసైటీ, కానస్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్)
–అక్టోబర్ 25, 2024: పేపర్–4 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్)
–అక్టోబర్ 26, 2024: పేపర్–5 (సైన్స్ %డ% టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్)
–అక్టోబర్ 27, 2024: పేపర్–6 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర అవతరణ)

# 70వ జాతీయ ఫిల్మ్ అవార్డుల ప్రకటన












**ఉత్తమ తెలుగు మూవీ కార్తీకేయ 2**
**ఉత్తమ నటుడిగా రిషబ్,నటిగా నిత్యామీనన్, మానసి**
**ఉత్తమ చిత్రంగా మలయాళం మూవీ అట్టమ్**
**ప్రకటించిన కేంద్రం**

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

**70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను శనివారం కేంద్రం ప్రకటించింది. 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలు గాను ఈ అవార్డులను ఎంపిక చేశారు. జాతీయ ఉత్తమ చిత్రంగా మలయాళ చిత్రం 'అట్టం' ఎంపికకాగా, జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం కన్నడ 'కాంతార' సినిమాలో అద్భుతమైన నటన కనపరచిన రిషబ్ శెట్టిని వరించింది. ఇక జాతీయ ఉత్తమనటి పురస్కారానికి తమిళ చిత్రం 'తిరుచిట్రంబళం' చిత్రానికి గాను నిత్యామీనన్, గుజరాతీ చిత్రం 'కచ్ ఎక్స్‌ప్రెస్' చిత్రానికి గాను మానసి పరేఖ్‌లను సంయుక్తంగా ఎంపిక చేశారు.**

70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలోఉత్తమ ప్రాంతీయ చిత్రాలుగా తెలుగు నుంచి కార్తికేయ 2, ఉత్తమ తమిళ చిత్రంగా పొన్నియన్ సెల్వన్–1, ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్ 2 చిత్రాలు నిలిచాయి. ఇక ఉత్తమ చిత్రం అవార్డు మలయాళం మూవీ అట్టమ్ కైవసం చేసుకుంది.. 2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి నామినేషన్ అందాయి. 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది.

స్వీయ దర్శకత్వంలో రిషబ్‌శెట్టి నటించిన 'కాంతార' చిత్రం దేశవ్యాప్తంగా అద్భుత విజయం సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దైవిక అంశాలు, అడవి బిడ్డల అస్తిత్వ పోరాటం కలబోతగా ఈ చిత్రం అందరి మన్ననలు అందుకొంది. దక్షిణ కన్నడ ఆచార వ్యవహారాలు, ధార్మిక విశ్వాసాల నేపథ్యంలో ఈ సినిమా దేశవ్యాప్తంగా విశేష ఆదరణ సొంతం చేసుకుంది. దక్షిణ కన్నడ సంస్కృతిలో అనాదిగా భాగమైన భూతకోల ఆరాధన, పంజుర్లి దేవత నేపథ్యంలో వచ్చిన సన్నివేశాలు ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లాయి. ఈ సినిమాలో శివ పాత్రలో రిషన్‌శెట్టి అద్భుతాభినయాన్ని కనబరిచాడు. ఈ చిత్రం అన్ని భాషల్లో భారీ విజయం సాధించింది. నాలుగు వందల కోట్లకుపైగా వసూళ్లతో రికార్డు సృష్టించింది.

**పురస్కార విజేతలు వీరే**

**ఉత్తమ చిత్రం: ఆట్టమ్ (మలయాళం)**
**ఉత్తమ నటుడు: రిషబ్‌శెట్టి (కాంతార)**
**ఉత్తమ నటి: నిత్యమీనన్ (తిరుచిట్రంబళం-తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్-గుజరాతీ)**
**ఉత్తమ ప్రాంతీయ చిత్రం: కార్తికేయ-2**
**ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఉంచాయి)**
**ఉత్తమ జనరంజక చిత్రం: కాంతార**
**ఉత్తమ సహాయనటి: నీనా గుప్తా (ఉంచాయి)**
**ఉత్తమ సహాయ నటుడు: పవన్‌రాజ్ మల్హోత్రా (ఫౌజా)**
**ఉత్తమ సినిమాటోగ్రఫీ: రవివర్మన్ (పొన్నియన్ సెల్వన్)**
**ఉత్తమ సంగీతం: ప్రీతమ్ (బ్రహ్మాస్త్ర)**
**ఉత్తమ నేపథ్య సంగీతం: ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియన్ సెల్వన్)**
**ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్: అర్జిత్‌సింగ్ (కేసరియా-బ్రహ్మాస్త్ర)**
**ఉత్తమ ఫిమేల్ ప్లేబ్యాక్‌సింగర్: బొంబాయి జయశ్రీ (సౌది వెల్లక్క సీసీ 225/2009-మలయాళం)**
**ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ : బ్రహ్మాస్త్ర-1**
**ఉత్తమ సౌండ్ డిజైన్: ఆనంద్ కృష్ణమూర్తి (పొన్నియన్ సెల్వన్-1)**
**ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: నిక్కి జోషి (కచ్ ఎక్స్‌ప్రెస్)**



## సీఎంఆర్ లక్ష్యం సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**బలగం టీవీ ,సిరిసిల్ల:**

సీఎంఆర్ లక్ష్యం సెప్టెంబర్ 30వ తేదీలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు.శుక్రవారం 2023-24 ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ రా రైస్ లక్ష్యంపై జిల్లాలోని రైస్ మిల్లర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోనిఆడిటోరియంలో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ 2023-24 ఖరీఫ్ సీజన్ 1,34,861 క్వింటాళ్ల రా రైస్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటిదాకా 63,742 క్వింటాళ్లు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్ సీ ఐ) సివిల్ సప్లై శాఖలకు అప్పగించడం జరిగిందని అన్నారు.జిల్లాలోని రైస్ మిల్లర్లందరూ వారికి కేటాయించిన ధాన్యాన్ని వచ్చేనెల 30వ తేదీలోగా ఎఫ్ సీ ఐ, సివిల్ సప్లై కి సీఎంఆర్ రైసు రా రైస్ అందజేయాలని, ఎట్టి పరిస్థితుల్లో గడువు పెంచరని అన్నారు.ఇప్పటివరకు రా రైస్ ఇవ్వడంలో వెనుకబడిన మిల్లులను గుర్తించి వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని, ఆయా మిల్లులను నిత్యం తనిఖీ చేయాలని అధికారులు ఆదేశించారు. సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించే రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైస్ మిల్లర్లు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని రా రైస్ మిల్ యజమానులందరూ సమన్వయంతో ప్రభుత్వం అందించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు.గన్ని బ్యాగులు సమస్యను పరిష్కరించాలని రైస్ మిల్లుల యజమానులు అదనపు కలెక్టర్ ను కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీటీలు తదితరులు పాల్గొన్నారు.



## గవర్నర్‌ను సన్మానించిన జిల్లా రెడ్ క్రాస్ సభ్యులు

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాజ్ భవన్ లో రెడ్ క్రాస్ ప్రతినిధుల సమావేశం నిర్వహించగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ను రాజ్ రాజన్న సిరిసిల్ల రెడ్ క్రాస్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి,శాలువతో ఘనంగా సత్కరించారు. సిరిసిల్ల పవర్ లూమ్ కార్మికుల సమస్యలను గవర్నర్ దృష్టికి ఈ సందర్భంగా తీసుకువెళ్లేమని సంగీతం శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ సభ్యులు ప్రియాకర్ రావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 319 దరఖాస్తులు

**బలగం టీవీ , హైదరాబాద్**

మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో 319 దరఖాస్తులు అందా యి. రెవెన్యూ 50, మైనారిటీ వెల్ఫేర్ 61, పంచాయత్‌రాజ్ గ్రామీణాభివృద్ధి 27, విద్యుత్‌శాఖ 81, ఆరోగ్యశ్రీ 21 ఇతర శాఖలకు సంబంధించి 79 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేకాధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు.

### 'దేవర' నుంచి
## సైఫ్ అలీ ఖాన్ 'భైరా' గ్లింప్స్ విడుదల

**బలగం టీవీ , హైదరాబాద్**



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర'. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఇదిలావుంటే శుక్రవారం సైఫ్ అలీ ఖాన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా మేకర్స్ సైఫ్‌కి విషెస్ తెలుపుతూ.. దేవర నుంచి భైరా గ్లింప్స్ విడుదల చేశారు. ఈ వీడియోలో యోధుడిలా కనిపిస్తున్న భైరా మల్ల యుద్ధంలో ప్రత్యర్థిని ఎత్తి విసిరేస్తున్నట్టుగా వీడియోలో చూపించారు. ప్రస్తుతం ఈ వీడియో గూస్ బంప్స్ తెప్పిస్తుంది. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంతం నేపథ్యంలో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్, హరికృష్ణ కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ స్వరకర్త.

## 'హరిహరవీరమల్లు' షూటింగ్ ప్రారంభం..



**బలగం టీవీ , హైదరాబాద్**

%హైదరాబాద్: కొన్ని నెలలుగా ఆగిపోయిన హరిహర వీరమల్లు మూవీ షూటింగ్ ఈ నెల 14 నుంచి ప్రారంభమైనట్లు మేకర్స్ వెల్లడించారు. స్టంట్ మాస్టర్ శివ ఆధ్వర్యంలో 400-500 మంది ఫైటర్స్, జూనియర్ ఆర్టిస్టులతో భారీ యుద్ధ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలిపారు. మరికొన్ని రోజుల్లోనే పవన్ కళ్యాణ్ షుటింగ్‌లో పాల్గొంటారని, ఎప్పుడూ చూడని కొత్త గెటప్‌లో అలరిస్తారని పేర్కొన్నారు. దీంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# విలీన గ్రామాలను పంచాయతీలుగా మార్చండి..




**● పెద్దూర్ లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన..**

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలను తిరిగి మళ్లీ గ్రామపంచాయతీలుగా మార్చాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్దురులోని సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ ఆనాడు సిరిసిల్ల మున్సిపాలిటీలో 7 గ్రామాలను విలీనం చేశారని, అప్పటినుండి విలీన గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు అని అన్నారు. విలీన గ్రామాలను గ్రామపంచాయతీలుగా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, ప్రభుత్వవిప్,వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ లు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి విలీన గ్రామాలను మళ్లీ గ్రామపంచాయతీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. విలీన గ్రామాలను గ్రామపంచాయతీలుగా మార్చలేని పక్షంలో విలీన గ్రామాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు.ఈ కార్యక్రమం కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ నాయకులు చెన్నమనేని కమలాకర్ రావు, భూక్య రెడ్డి నాయక్, గంద్ర రమేష్ రావు, ఎర్రవెల్లి వెంకట రమణారావు, తంబటి జీవన్, విడుగురాళ్ల బాలరాజు,రాకం రమేష్,కొంపల్లి రవీందర్, సలంద్రి రాజు, జీల కిషన్,తిరుపతి నాయక్,సల్లూరి సంతోష్ గౌడ్,చందు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధరణి దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి..



**● అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ధరణిలో దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శుక్రవారం ధరణి దరఖాస్తులపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. ఆయా లాగిన్లలో కలిపి మొత్తం 866 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని అధికారులు తెలిపారు. తహసీల్దార్ల లాగిన్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ఆర్డీఓలకు పంపించాలని, ఆ తర్వాత జిల్లా స్థాయిలో పరిశీలించిన అనంతరం పరిష్కరించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు.ఈ సమావేశం లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు రమేష్, రాజేశ్వర్, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ యాదయ్యకు కేటీఆర్ అభినందనలు

**బలగం టీవీ , హైదరాబాద్**



విధి నిర్వహణలో విశేష ధైర్య సాహసాలు ప్రదర్శించి రాష్ట్రపతి మెడల్ సాధించిన తెలంగాణ బిడ్డ కానిస్టేబుల్ యాదయ్యకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. శుక్రవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ ఏడు కత్తి పొట్లు పడి రక్తం ధారలా కారుతున్నా చైన్ స్నాచింగ్ నిందితులను పట్టుకునేందుకు యాదయ్య చూపించిన తెగువ అసామాన్యమని పేర్కొన్నారు.2022లో జరిగిన ఈ ఘటనలో యాదయ్య చూపిన సాహసానికి గుర్తింపుగా గౌరవం దక్కడం సం తోషకరమన్నారు. సమర్థ నాయకత్వంలో తెలంగాణ పోలీసులు శక్తివంచన లేకుండా ఎలా పని చేశారో తెలపడానికి ఈ ఉదంతం గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు. యాదయ్య చూపించిన చిత్తశుద్ధి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు



## ముగిసిన పీకేఎల్ వేలం

**బలగం టీవీ , ముంబై**

దేశ ఆర్థిక రాజధాని వేదికగా రెండ్రోజులుగా జరిగిన ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) వేలం విజయవంతంగా ముగిసింది. 11వ సీజన్ కోసం వేలాన్ని నిర్వహించగా రెండ్రోజుల్లో మొత్తం 118 మంది ఆటగాళ్లను ఫ్రాంఛైజీలు కొనుగోలు చేశాయి. తొలి రోజే సచిన్ తన్వర్‌ను తమిళ్ తలైవాస్ రూ. 2.15 కోట్లతో ఈ సీజన్‌లో అత్యధిక ధరకు కొనుగోలు చేయగా రెండో రోజు అజిత్ వి. కుమార్ (పూణె - రూ. 66 లక్షలు) పంట పండింది. జై భగవాన్‌ను బెంగళూరు జట్టు రూ. 63 లక్షలకు సొంతం చేసుకుంది. పీకేఎల్ చరిత్రలో తొలిసారిగా ఏకంగా 8 మంది ఆటగాళ్లు కోటి రూపాయల మార్కును దాటడం విశేషం. వేలంలో స్టార్ ఆటగాళ్లతో పాటు కేటగిరి- సీ, డీ ప్లేయర్లకూ భారీ డిమాండ్ ఏర్పడిందని లీగ్ కమిషన్, మషాల్ హెడ్ స్పోర్ట్స్ లీగ్స్ హెడ్ అనుపమ్ గోస్వామి తెలిపారు. తెలుగు టైటాన్స్ రూ. 1.72 కోట్లతో పవన్ సెహ్రావత్‌ను అట్టిపెట్టుకున్న విషయం తెలిసిందే.




## 84మంది అథ్లెట్లతో భారత బృందం

**బలగం టీవీ , పారిస్**

పారా ఒలింపిక్స్‌లో భారత ప్రారంభోత్సవ వేడుకల పతక ధారులుగా భాగ్యశ్రీ జాధవ్, సుమిత్ అంతిమ్ వ్యవహరించనున్నారు. 84మంది అథ్లెట్లతో కూడిన భారత బృందం ముందు వీరు నడవనున్నట్లు భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ) శుక్రవారం వీడ్కోలు సభను నిర్వహించింది. కేంద్ర క్రీడల శాఖామంత్రి డా.మన్సుక్ మాండవీయ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. పారా ఒలింపిక్ ఆఫ్ ఇండియా(పిసిఐ) అధ్యక్షులు, పారా ఒలింపిక్స్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన దేవేంద్ర ఝజారియా భారత బృందంతో వెళ్లనున్నారు. పారా ఒలింపిక్స్ ప్రారంభోత్సవాలకు ఫ్లాగ్‌బేరర్లుగా మహారాష్ట్రకు చెందిన భాగ్యశ్రీ జాదవ్, సుమిత్ అంతిల్ వ్యవహరించనున్నారు. జాధవ్ షాట్‌పుట్ క్రీడాకారిణి కాగా.. ఎఫ్ 34 కేటగిరీలో నిలకడైన ప్రదర్శన చేస్తోంది. జావెలిన్‌త్రో స్టార్ సుమిత్ అంతిల్ ఎఫ్ 64 కేటగిరీలో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. టోక్యో పారా ఒలింపిక్స్‌లో అతడు 68.55 మీటర్లు విసిరి బంగారు పతకాన్ని సాధించాడు. 2020 టోక్యో పారాఒలింపిక్స్‌లో భారత్ 54మంది అథ్లెట్లతో వెళ్లి.. 5 స్వర్ణాలు, 8 రజతాలు, 6 కాంస్యాలతో సహా మొత్తం 19 పతకాలతో 24వ స్థానంలో నిలిచింది. పారిస్‌లో పారా ఒలింపిక్స్ ఆగస్టు 28నుంచి సెప్టెంబర్ 8వరకు జరగనున్నాయి.

**పారా ఒలింపిక్స్‌కు భారత బృందం ఇదే..**

ఆర్చరీ: హర్విందర్ సింగ్, రాకేశ్ కుమార్, శ్యామ్ సుందర్ స్వామి, పూజ, సరిత, శీతల్ దేవి

అథ్లెటిక్స్: దీప్తి జీవాంజి, సుమిత్ అంతిల్, సందీప్, అజీత్ సింగ్, సుందర్ సింగ్ గుర్జార్, రింకు, నవ్‌దీప్, యోగేశ్, ధరంబీర్, అమిత్ కుమార్, నిషాద్ కుమార్, రామ్ పాల్, మరియప్పన్ తంగవేలు, శైలేష్ కుమార్, శరద్ కుమార్, సచిన్ సర్జేరావు ఖిలారి, మహమ్మద్ యాసెర్, రోహిత్ కుమార్, ప్రీతి పాల్, భాగ్యశ్రీ మాధవ్‌రావు జాధవ్, మను, ప్రవీణ్‌కుమార్, రవి రొంగలి, సందీప్ సంజరు గుర్జార్, అరవింద్, దీపేశ్ కుమార్, ప్రవీణ్ కుమార్, దిలీప్ మహదు సోమన్ రానా, హొకటో సేమ, సాక్షి కసానా, కరమ్ జ్యోతి, రక్షిత రాజు, అమిషా రావత్, భవనాబెన్, సిమ్రన్, కంచన్ లఖాని

బ్యాడ్మింటన్: మనోజ్ సర్కార్, నితేశ్ కుమార్, కష్ణ నగర్, శివరాజన్ సోలైమలై, సుహాస్ యతిరాజ్, సుకాంత్ కాదమ్, తరుణ్, మానసి జోషి, మన్‌దీప్ కౌర్, పాలక్ కోహ్లి, మనీషా రామదాస్, తులసిమతి మురుగేశన్, నిత్యశ్రీ శివన్

కనావో: ప్రాచీ యాదవ్, యశ్ కుమార్, పూజా

సైక్లింగ్: అర్షద్ షైక్, జ్యోతి గడేరియా

బ్లైండ్ జూడో: కపిల్ పర్మార్, కోకిలా

పవర్ లిఫ్టింగ్: పరమ్‌జీత్ కుమార్, అశోక్, శకినా ఖతున్, కస్తూరి రాజమణి


రోయింగ్: అనిత, నారాయణ కొంగనపల్లె

షఉటింగ్: అమిత్ అహ్మద్ భట్, అవని లేఖర, మోనా అగర్వాల్, నిహాల్ సింగ్, మనీశ్ నర్వాల్, రుద్రాంక్ష్, సిద్ధార్థ్ బాబు, శ్రీహర్ష దేవరద్ది రామకష్ణ, స్వరూప్ మహవీర్, రుబినా ఫ్రాన్సిస్

స్విమ్మింగ్: సుయాశ్ నారాయణ్ జాధవ్

టేబుల్ టెన్నిస్: సోనాల్‌బెన్ పటేల్, భవినాబెన్ పటేల్.

## ఓటీటీలోకి తుఫాన్




బిచ్చగాడు మూవీతో తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు తమిళ నటుడు విజయ్ ఆంటోని. అప్పటి నుంచి ఆయన నటించిన చిత్రాలు తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల అవుతున్నాయి. విజయ్ నటించిన తాజా చిత్రం తుఫాన్.ఎలాంటి చడీచప్పుడు కాకుండానే ఓటీటీలోకి వచ్చేసింది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్‌పై కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించారు.సత్యరాజ్, శరత్ కుమార్, మేఘా ఆకాష్, మురళీ శర్మ, డాలీ ధనుంజయ లు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనిపించింది. అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. అయితే.. ప్రస్తుతం తమిళ వర్షెన్ మాత్రమే ఓటీటీలో అందుబాటులోకి వచ్చింది. తమిళంలో ఈ మూవీ ఆగస్టు 2న విడుదల చేశారు. వచ్చేవారం నుంచి తెలుగులోనూ అందుబాటులోకి రానున్నట్టుగా తెలుస్తోంది.




## డోప్ టెస్టులో దొరికిన శ్రీలంక క్రికెటర్

**బలగం టీవీ , ముంబై**

శ్రీలంక క్రికెటర్ నిరోషన్ డిక్‌వెల్లా డోప్ పరీక్షలో విఫలమయ్యాడు. దాంతో అతడిని శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్ చేసింది. ఇటీవలే ముగిసిన లంక ప్రీమియర్ లీగ్ సమయంలో నిరోషన్ డోప్ టెస్టులో దొరికిపోయాడు. అంతర్జాతీయ డోపింగ్ ఏజెన్సీ నియమాలను అతడు ఉల్లంఘించాడు. దాంతో, ఈ వికెట్ కీపర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. తదుపరి ప్రకటన చేసేంత వరకు నిరోషన్‌పై నిషేధం కొనసాగుతుందని శుక్రవారం లంక క్రికెట్ తెలిపింది.'నిరోషన్ డిక్‌వెల్లాపై తక్షణమే నిషేధం అమలులోకి రానుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ అతడిపై సస్పెన్షన్ అలాగే ఉంటుంది. వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ మార్గదర్శకాల ప్రకారం క్రీడా మంత్రిత్వ శాఖ నిరోషన్‌పై ఈ చర్య తీసుకుంది. క్రికెట్‌ను నిషేధిత పదార్థాల నుంచి దూరంగా ఉంచాలనేది మా ఉద్దేశం' అని లంక క్రికెట్ వెల్లడించింది.

ఈమధ్యే ముగిసిన లంక ప్రీమియర్ లీగ్‌లో డిక్‌వెల్లా గాలె మార్వెల్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతడు 2023 మార్చిలో దేశం తరపున ఆఖరి మ్యాచ్ ఆడాడు. ఈ ఏడాది బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌కు సెలెక్టర్లు డిక్‌వెల్లాను ఎంపిక చేశారు. కానీ, అతడు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడలేదు. శ్రీలంక తరపున ఈ లెఫ్ట్ హ్యాండర్ టెస్టుల్లో 2,757, వన్డేల్లో 1,604. టీ20ల్లో 480 పరుగులు సాధించాడు.